సాక్షి
సంగారెడ్డి
శనివారం । 15 । జూలై । 2023



బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామశివారులో ఆర్టీసీ బస్సును ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో



తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు పంపే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. 8లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా, అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా చంద్రశేఖర్



బి.చంద్రశేఖర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ)గా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా చంద్రశేఖర్‌ను నియమించింది. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన రాజర్షిషాకు గత కొన్ని నెలల బదిలీ అయింది. ఆయన మెదక్ కలెక్టర్‌గా నియమితులైన విషయం విదితమే. అప్పటి నుంచి సంగారెడ్డి అదనపు కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

అదనపు కలెక్టర్‌గా మాధురి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఆర్.డి.మాధురి నియమితులయ్యారు. మాధురి జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.వీరారెడ్డికి బదిలీ అయ్యింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరారెడ్డి 2020 ఫిబ్రవరిలో జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్లకు పైగా సంగారెడ్డి జిల్లాలో పనిచేశారు.

ఏపీ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వైయస్ జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఏపీ ప్రభుత్వం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించినందుకు సంగారెడ్డి ప్రజా సంఘాలు హర్షం ప్రకటించాయి. ఐబీ ముందు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ భూములకు యాజమాన్యం హక్కులు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేబినెట్ నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అసైన్డ్ భూములపై యాజమాన్యం హక్కులు కల్పించి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ



గొర్రెలు అందిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్: సబ్సిడీ గొర్రెల పథకంలో లబ్ధిదారులకు గొర్రెలను రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆరు గొర్రెల యూనిట్లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గొల్ల కురుమల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమానికి సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, గొర్రెల కాపరుల చైర్మన్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు

స్పందించిన వెల్‌నెస్ సెంటర్ ఉన్నతాధికారులు

సాక్షి స్పందన

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎట్టకేలకు జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ ఉన్నతాధికారులు స్పందించారు. గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన 'సిబ్బంది లేక.. సేవలందక' శీర్షికకు హైదరాబాదులో ఉన్న అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశాలాక్షి మాట్లాడుతూ సెంటర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయని, ఉంచుతామని, అలాగే అన్ని విభాగాల్లో డాక్టర్స్ అందుబాటులో ఉంటున్నారన్నారు. కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్నారు. అలాగే పాడైన పరికరాలను బాగు చేయిస్తామని వెల్లడించారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు

- గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రభావం
- జిల్లాలో 2,582 మంది కార్మికులు
- జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్
- మల్టీ పర్పస్ విధానానికి వ్యతిరేకం
- 8 గంటల పని విధానం అమలుకు పోరు



సదాశివపేట ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె బాట పట్టారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలని తదితర డిమాండ్లతో సమ్మెకు దిగారు. పలుమార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాలు తమ మద్దతును ప్రకటించాయి.

ప్రత్యామ్నాయ మార్గాలపై ..

- గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి తొమ్మిదవ రోజుకు చేరుకుంది. దీంతో కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇతర పనులపై ప్రభావం పడుతోంది.
- జిల్లాలోని 647 గ్రామ పంచాయతీల్లో 2,582మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఐదు నుంచి ఆరుగురు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించడంతోపాటు డ్రైనేజీల నిర్వాహణ, హరితహారం మొక్కల సంరక్షణ, ఇంటింటికి చెత్త సేకరణ, విద్యుత్ దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా లాంటి పనులు ఈ కార్మికులు చేస్తుంటారు.
- వర్షాకాలం కావడంతో పారిశుధ్య సమస్య ఎదరయ్యే ప్రమాదం ఉంది. దీంతతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు.
- పంచాయతీల్లో అత్యవసరమైన పనులను తాత్కాలిక సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- 2018లో చేపట్టిన నిరవధిక సమ్మెకాలంలో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికుల డిమాండ్లు ఇవే...

- కార్మికులు, సిబ్బందిని క్రమబద్ధీకరించాలి
- ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి
- పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం నెలకు రూ.19 వేల వేతనం చెల్లించాలి
- కారోబార్, బిల్ కలెక్టర్‌ను సహాయ కార్యదర్శులుగా నియమించాలి
- జీవో 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- విధి నిర్వాహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి
- ఆదాయ వనరులున్న గ్రామ పంచాయతీల్లో వేతనాలు పెంచడానికి అనుమతి ఇవ్వాలి
- 8 గంటల పనిదినాలు అమలు చేయాలి
- పండుగ సెలవులు, వారాంతపు సెలవు, అర్జిత సెలవులు అమలు చేయాలి
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
- జీఓ 60ప్రకారం వేతనాలు చెల్లించాలి

చాలీచాలని జీతాలతో ఇబ్బందులు



గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసే మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నోసార్లు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదు. చాలీచాలని జీతాలతో కుటుంబం గడవడం కష్టతరంగా ఉంది. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలి. – దశరథ్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలి



గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలి. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన చేసి ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. – నాగేష్, పంచాయతీ కార్మికుడు గొల్లగూడెం, సదాశివపేట మండలం

హామీలు నిలబెట్టుకోవాలి



2018లో చేపట్టిన నిరవధిక సమ్మెకాలంలో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నాం. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మెకు దిగాం. శుక్రవారానికి తొమ్మిదవ రోజుకు సమ్మె చేరుకుంది. –మహిపాల్, పంచాయతీ కార్మికుడు పెద్దాపూర్, సదాశివపేట మండలం

విద్యుత్ సరఫరా బంద్

కోహీర్(జహీరాబాద్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బిలాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దులా హబీబ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని బిలాల్‌పూర్, బడంపేట, మనియార్‌పల్లి గ్రామాలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలన్నారు.

దత్తగిరిలో పూజలు



పూజలు చేస్తున్న అనసూయ మాత

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మాతృశ్రీ అనసూయ మాత ఆధ్వర్యంలో 108 మంది పురోహితులతో శ్రీ రుద్ర సహిత దత్త యజ్ఞం, జ్యోతిర్లింగాలకు ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి మహా రుద్రాభిషేకం, మహా మంగళారతి, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ మాత, వైదిక పాఠశాల ఆచార్యుడు శివశంకర్ స్వామి, బర్దిపూర్ సర్పంచ్ శివలక్ష్మి కృష్ణ, హరీశ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు

పటాన్‌చెరు టౌన్: గ్రామపంచాయతీ సిబ్బందిపై అధికారుల బెదిరింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్మికులకు, సిబ్బందికి కనీస వేతనాలకు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తుంటే వారిని తొలగిస్తామని బెదిరిస్తున్నారని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజక వర్గంలో రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేశ్, రాములు, పోచయ్య, చెన్నయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాభవాని జాతర

- డప్పు వాయించిన ఎమ్మెల్యే జగ్గారెడ్డి



యువకులతో కలిసి నృత్యం చేస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): ఆషాఢమాసం సందర్భంగా కొనసాగిన దుర్గాభవాని బోనాల జాతర శుక్రవారం ముగిసింది. భక్తులు దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు హాజరైన సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి డప్పు వాయించి యువకులను ఉత్సాహపరిచారు. వారితో కలిసి నృత్యం చేశారు. సాయంత్రం గడీల వారి ఇంటి నుంచి కల్లుకుండ, బోనంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోతురాజు గావుతో జాతర ముగించారు. మందిరం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగించారు. సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనీస వేతన జీఓలను సవరించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

కొండాపూర్(సంగారెడ్డి): కాల పరిమితి ముగిసిన కనీస వేతన జీఓలను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో కోటి మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరందరికీ కనీస వేతనాలను సవరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లయినా కనీస వేతన సవరణ ప్రక్రియ చేపట్టలేదన్నారు. కార్మికుడికి రోజుకు రూ.178 సరిపోతాయని కేంద్రం ప్రకటించడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను ఐదేళ్లకోసారి సవరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేశం, సాయిలు, కోశాధికారి నరసింహారెడ్డి ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి బాగారెడ్డి ప్రవీణ్ కుమార్ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు యాదగిరి మహిపాల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన, డిజిటల్ ఔట్ రీచ్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఓటరు జాబితా సవరణకు వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిశీలించాలన్నారు. దరఖాస్తులను జూలై 27 నాటికి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూలై 28 నుంచి స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని, ఈ కార్యక్రమాల నిర్వహణపై రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ శరత్, డీఆర్ఓ నగేశ్, ఏఓ మహిపాల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించటంలో భాగస్వాములు కావాలి

- అటవీ శాఖ రేంజ్ అధికారి వీరేంద్రబాబు



మొక్క నాటుతున్న అటవీశాఖ రేంజ్ అధికారి వీరేంద్రబాబు

జిన్నారం(పటాన్‌చెరు): అడవులను రక్షించటంలో ప్రజలు భాగస్వాములు కావాలని అటవీశాఖ రేంజ్ అధికారి వీరేంద్రబాబు అన్నారు. మండలంలోని ఖాజీపల్లి అటవీ ప్రాంతంలోని 25 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి వేణుగోపాల్, బీట్ అధికారి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ సీఐకి ఉత్తమసేవా పతకం



వేంకట రాజాగౌడ్

సంగారెడ్డి మున్సిపాలిటీ: విధినిర్వహణలో ఉత్తమ సేవలదించిన పోలీసు శాఖలో పనియచేస్తున్నవారికి ప్రభుత్వం పురస్కారాలు అందజేసింది. ఏసీబీ సీఐ వేంకట రాజాగౌడ్‌కు ఉత్తమ సేవా పతకం ప్రకటించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

జోనల్ కమిషనర్‌కు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. బదిలీపై వచ్చిన కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలసి డివిజన్ సమస్యలను వివరించడం జరిగిందన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

నిరసన దీక్షను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

కొండాపూర్(సంగారెడ్డి): గురుకుల వసతి గృహాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారు మేనేజ్‌మెంట్‌లలో పనిచేస్తున్న గురుకుల టీచర్లకు పారిటీ స్కేల్స్ ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ జారీ చేయాలని, అలాగే కెరటేకర్స్, డిప్యూటీ వార్డెన్ పోస్టుల భర్తీ, పని ఒత్తిడి తగ్గించాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా జూలై 17న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి మండల అధ్యక్షుడు ఎం.విజయానంద్, కార్యదర్శి జ్యోతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల నిర్వహణ అధ్వానం

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్



మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉమ్మడి మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ విమర్శించారు. శుక్రవారం తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జనజాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాలను సూపరింటెండెంట్ ఆంజనేయులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు పనిచేయకున్నా పనిచేసినట్లు ప్రిన్సిపాల్స్‌ను ఒత్తిడి చేస్తూ వారి వేతనాలు క్లెయిమ్ చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గురుకులాల్లో పార్ట్ టైమ్ ఉపాధ్యాయులను నియామకం చేపట్టమని ప్రభుత్వం ఆదేశిస్తే, సీనియారిటీ చూడకుండా, ఉన్నత విద్యార్హతలు లేకున్నా డబ్బులు ఇచ్చినవారికే ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ నియామకాల్లో రోస్టర్ విధానం పాటించకుండా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి హర్షిత్, యువజన సంఘం నాయకుడు కలకుంట్ల అనిల్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకుడు ప్రవీణ్ ముదిరాజ్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

కొండాపూర్ (సంగారెడ్డి): రెండు సార్లు దళితులను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యశ్వంత్ అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు శుక్ర వారం సంగారెడ్డి పాత బస్టాండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుడిని సీఎం చేస్తానంటూ మొదటిసారి, మూడెకరాల పొలం ఇస్తా అంటూ రెండోసారి ఇలా అవకాశం దొరికిన ప్రతీసారి వారిని బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

బాలలను నేరస్తులుగా చూపొద్దు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి హనుమంతరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: నేరం మోపబడిన బాలలను నేరస్తులుగా చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని బాల రక్షక్ భవనంలో జువైనల్ కోర్టులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలల హక్కులకు భంగం కలిగించరాదని, పోలీసులు వారితో సరైన పద్ధతిలో మెలగాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కోర్టు జడ్జి షాలిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిందితుడికి రిమాండ్



సాక్షులను విచారిస్తున్న సీఐ, ఎస్‌ఐ

సంగునూరు(సిద్దిపేట): తండ్రిపై దాడి చేసి అతని మరణానికి కారణమైన కొడుకును రిమాండ్‌కు తరలించారు. భూమి కౌలు విషయమై గట్లమల్యాలలో ఎర్రవెల్లి రాజయ్యపై అతని కుమారుడు ఎర్రవెల్లి రవి దాడి చేయడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం రవిని రిమాండ్‌కు తరలించామని వారు తెలిపారు.

వెజ్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న దుకాణాలు

సిద్దిపేటజోన్: స్థానిక ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్‌లో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. కూరగాయలను విక్రయించే బ్లాక్‌లో రెండు దుకాణాలు దగ్ధం అయ్యాయి. మంటలను సకాలంలో సిబ్బంది ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ వెంకటయ్యలు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20వేల కూరగాయలు దగ్ధం అయినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో జరిగిన దుర్గమ్మ జాతర మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల రెడ్డి, తోపాజీ అనంత కిషన్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సదాశివపేట రూరల్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో జరిగిన ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై ఆర్టీసీ బస్సు లారీని ఢీ కొని డ్రైవర్‌తో సహా ఆరుగురికి గాయాలయ్యాయి.



న్యాల్‌కల్: బస్సును ఢీ కొన్న కారు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సును ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హద్నూర్ ఎస్‌ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం..కర్నాటక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తుంది. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్ గ్రామ శివారులో జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆల్టోకారు రాంగ్ రూట్లో వచ్చి బస్సును ఢీ కొంది. కారును అతి వేగంగా నడపడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు డ్రైవర్ సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా అంగారాజీపల్లి గ్రామానికి చెందిన వాడు. మరో వ్యక్తి వెంకటేశ్వర్ రాజ్ గుంటూర్ జిల్లాకు చెందిన వాడని ఎస్‌ఐ తెలిపారు. తీవ్ర గాయాలైన వెంకటేశ్వర్‌రాజును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బస్సు కండక్టర్ శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రఘు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సదాశివపేట రూరల్‌లో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న మినీ అంబులెన్స్ నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే అదుపు తప్పింది. పార్కు చేసిన ఇన్నోవా వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ సర్జీరావు భారటే(45)స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో ఆయన్ను మరో అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డుపై చోటు చేసుకుంది. జీపీపీ ఆర్టీసీ డిపో సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు 25మంది ప్రయాణీకులతో జేబీఎస్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారు జామున ప్రజ్ఞాపూర్ సమీపంలో రింగురోడ్డు మీదుగా వెళ్తున్న క్రమంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రాజ్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గుండెపోటుతో ఇద్దరి మృతి

వడ్డేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందగా, కొండపాక విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పూస బాల కిషన్ గుండెపోటుకు గురై మృతి చెందారు.

రాయపోలు(దుబ్బాక): వడ్డేపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..సూర్యాపేట జిల్లా లింగాల గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరెడ్డి (54) వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇక్కడ 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి గజ్వేల్‌లో నివాసముంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం పాఠశాలకు వెళ్లొచ్చిన ఆయన రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృతితో వడ్డేపల్లి పాఠశాలలో విషాదం నెలకొంది.



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

గుండెపోటుతో వాచ్‌మెన్..

కొండపాక(గజ్వేల్): 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న పూస బాలకిషన్(36) గుండెపోటుతో మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన బాలకిషన్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. దినచర్యలో భాగంగా గురువారం డ్యూటీ చేస్తుండగా శుక్రవారం ఉదయం నిద్రలేవలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పుపత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ పుష్పరాజ్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని శివసాయి నగర్ కాలని సమీపంలోని దినేష్ హోమ్స్ ప్రక్కన నాలాలో ఒక గుర్తు తెలియని మహిళా మృతదేహం శుక్రవారం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి ఎడమ చేతిపై ×మధు, అంజి, అమ్మ॰ అనే పచ్చబొట్టును గుర్తించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలి చేతిపై మధు, అంజి, అమ్మ అని పచ్చబొట్టు

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

మెదక్‌జోన్: కుక్కల దాడిలో నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఔరంగాబాద్ తండాలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఔరంగాబాద్ తండాకు చెందిన మాలోత్ శ్రీను రోజూమాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి రాత్రి కొట్టంలో కట్టివేశాడు. తెల్లారి చూసే సరికి కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను చంపేసినట్లు బాధితుడు శ్రీను తెలిపారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు. సంఘటనా స్థలాన్ని వెటర్నరీ అధికారి లక్ష్మణ్ సందర్శించారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ముద్దాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం ప్రకారం..గ్రామానికి చెందిన కురుమ యాదగిరి (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పొలం వద్ద జారి పడగా కాలు విరిగింది. ఆరు నెలల క్రితం బైక్‌పై నుంచి పడి కాలు విరిగింది. అప్పటి నుంచి సరిగా నడవ లేక పోతున్నాడు. దీంతో పొలం పనులు చేసుకోలేక తరచూ బాధ పడుతుండేవాడు. ఈ నెల 8న పొలానికి వెళ్లోస్తానని ఇంట్లో చెప్పి రాలేదు. దీంతో అతని భార్య పొలం వద్దకు వెళ్లి చూడగా యాదగిరి పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. వెంటనే అతన్ని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



యాదగిరి (ఫైల్)

నిందితుడికి యావజ్జీవ శిక్ష

చేగుంట(తూప్రాన్): వరకట్న వేధింపుల కారణంగా భార్య మృతికి కారణమైన భర్తకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. 2017లో మక్కరాజీపేట గ్రామంలో అగల్‌దివిటి మానస(24) వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు మానస భర్త విక్రమ్‌జీ పై చేగుంట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాంగోపాల్ రావు విచారణ చేసి నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో వాదనలు విన్న జడ్జి లక్ష్మీశారద నిందితుడు విక్రమ్‌జీ నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి సాక్షులను ప్రవేశ పెట్టగా ప్రభుత్వ న్యాయవాది ఫైజల్‌అహ్మద్ వాదనలు వినిపించారు. కేసు విచారణకు చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్, కానిస్టేబుల్ లక్ష్మీపతి తూప్రాన్ డీఎస్పీకి సహాయకులుగా పనిచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైనర్లను పనిలో పెట్టుకోవద్దు

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్

కోహీర్(జహీరాబాద్): మైనర్లను పనిలో పెట్టుకోవద్దని జహీరాబాద్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ నర్సిములు సీడబ్ల్యుఎస్సీ సభ్యులు శ్రావణ్‌కుమార్‌తో కలిసి కోహీర్ పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లు, వ్యాపారసంస్థలలో తనిఖీలు నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. వారిని పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి వందశాతం అక్షరాస్యత సాధించడానికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కోహీర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాలకార్మికుడిని బడిలో చేర్పించిన అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): బడిమానేసిన బాలకార్మికుడిని గుర్తించి మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం చేర్పించామని ఎంఈఓ అంజయ్య తెలిపా రు. వివరాలు ఇలా ఉన్నాయి..కొండాపూర్ మండలంలోని ఆదర్శ జిమ్యాక్స్ కాలనీలో నివాసం ఉంటూ చెత్త సేకరిస్తూ కనిపించడంతో అతని వివరాలు తెలుసుకొని ఇంటికి వెళ్లి తల్లి ముంతాజ్‌కు చదువు విలువ గురించి వివరించి ఒప్పించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మెహరాజ్‌లు, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాకేశ్, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు సహకరించారని ఎంఈఓ అంజయ్య తెలిపారు.



తల్లి ముంతాజ్‌కు నచ్చచెబుతున్న ఎంఈఓ దండు అంజయ్య

అనుమానాస్పదంగా వ్యక్తి అదృశ్యం

కోహీర్(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కొత్తగొల్ల తుక్కప్ప, భార్య ఈశ్వరమ్మ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో కలిసి 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌కు వెళ్లారు. ఈశ్వరమ్మ, శ్రీనివాస్ తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. తుక్కప్ప మాత్రం కనిపించకుండా పోయాడు. తుక్కప్ప కోసం బంధుమిత్రుల వద్ద, తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా అతని ఆచుకీ లభించలేదు. తుక్కప్ప అదృశ్యం వెనుక భార్య ఈశ్వరమ్మ, శ్రీనివాస్ హస్తం ఉందని తుక్కప్ప తమ్ముడు విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ లక్ష్మీబాబు

రామాయంపేట(మెదక్): 35కు పైగా చోరీ కేసులతో సంబంధం ఉన్న అంతర్ రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం ..నార్సింగి మండలం కాస్లాపూర్‌కు చెందిన బాలమణి గత నెల 25న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుంది. అక్కడే మాటువేసి ఉన్న నిందితుడు మరొకరితో కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయాడు. తూప్రాన్ మండలం హైదర్‌గూడ గ్రామానికి చెందిన ఓ మహిళ పుస్తెలతాడు అపహరించిన కేసులో ఇతడే ప్రధాన నిందితుడని సీఐ పేర్కొన్నారు. నిందితుడు బల్జీత్‌సింగ్ సంకాపూర్ స్టేజీవద్ద ఉండగా అతన్ని అరెస్ట్ చేసి విచారించారు. ఈ విచారణలో తను గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన బల్జీత్‌సింగ్‌కు కర్ణాటకలో, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పలు కేసులతో సంబంధం ఉందని సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బాలాజీసింగ్, శంశేర్‌సింగ్‌ల కోసం గాలిస్తున్నామని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులను చాకచక్యంగా చేధించిన సీఐ లక్ష్మీబాబు, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట ఎస్‌ఐలు నర్సింలు, శ్రీనివాసరెడ్డి, ఎస్‌హెచ్‌వో సురేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు భాస్కర్, నాగభూషణం, కుమార్, ఖాజా జహంగీర్, యాదగిరి, కృష్ణ, సూర్యప్రకాశ్‌ను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించి రివార్డులు అందజేశారు.



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీబాబు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- సికింద్రాబాద్ నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న వైనం
- లారీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 209 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు, సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులోని రిమ్, జిమ్ దాబా వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ దినేష్ పోలేను అదుపులో తీసుకున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నాందేడ్‌కు తరలిస్తున్న దాదాపు 209 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని పటాన్‌చెరు పౌరస రఫరాల గోదాంకు తరలించారు. డీటీసీఎస్‌లు విష్ణు వర్ధన్, దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లారీని సీజ్ చేసిన అధికారులు

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

కంది(సంగారెడ్డి): కంది మండలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మామిడిపల్లి, ఏర్దనూర్ ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు శుక్రవారం ఛిద్రుప్పశివారులోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను తొలగించారు. గ్రామ శివారులోని సర్వేనంబర్లు 116, 117లలో అసైన్డ్ భూమిలో నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి నిర్మాణాలకైనా సరే హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న పంచాయతీ అధికారులు

గ్రానైట్ లారీ బోల్తా

తొగుట(దుబ్బాక): గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట నుంచి గజ్వేల్‌కు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీకి ఎదురుగా మరోక వాహనం రావడంతో లారీని ప్రక్కకు తప్పించబోయేక్రమంలో అదుపుతప్పింది. దీంతో పంట పొలంలోకి దూసుకుపోయి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.



పొలంలో బోల్తాపడిన గ్రానైట్ లారీ

తప్పుడు మెసేజ్‌లతో మోసపోవద్దు

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా మోసం చేస్తున్నారు. ఫోన్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్‌ను చూసి మోసపోవద్దని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పింక్ వాట్సాప్‌కు వచ్చే ఫార్వర్డ్ మెసేజ్ నమ్మి మోసపోవద్దన్నారు. ఆ లింక్‌ని క్లిక్ చేసి యాప్ ఇన్స్టాల్ చేస్తే మీ ఫోన్‌లో పూర్తి డాటా ఫొటోస్, కాంటాక్ట్స్, బ్యాంకింగ్ డిటెయిల్స్ ఓటీపీ, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతాయన్నారు. మిలియన్ల మంది వినియోగదారులతో, దేశంలో అత్యధికంగా ఉపయోగించే మెసేజింగ్ ప్లాట్‌ఫాంలలో వాట్సాప్ ఒకటి అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా పింక్ వాట్సాప్ పేరుతో ఓ లింక్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని పేర్కొన్నారు. పింక్ వాట్సాప్ లింక్‌ను క్లిక్ చేస్తే మీ ఫోన్‌లో ఉన్న సమాచారమంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. అదే విధంగా మీ బ్యాంకు ఖాతాల, సోషల్ మీడియా అకౌంట్ల పాస్‌వర్డ్‌లను మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి ఫోన్‌లకు వచ్చే ఎటువంటి మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు.



పింక్ వాట్సాప్‌కు సంబంధించిన లింకులు

హత్యాయత్న నిందితుడి రిమాండ్

సదాశివపేట(సంగారెడ్డి): పేకాట ఆడుతున్నాడనే విషయాన్ని పోలీసులకు చెప్పాడనే కోపంతో ఓ వ్యక్తిని చంపేందుకు ప్రయత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 6న పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సమీయుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన సలిమాబి కుమారుడు సాజీద్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల13న తెల్లవారుజామున 4 గంటలకు సిద్దాపూర్ కాలనీయందు సాజీద్‌ను హత్యచేసేందుకు మటన్ కోసే కత్తితో దాడి చేశాడని దీంతో అతను తప్పించుకున్నాడు. ఈ క్రమంలోనే 14తేదీన ఉదయం సాజీద్‌ను చంపడానికి సమీయుద్దిన్ ఇంటి నుంచి పల్సర్‌బైక్‌లో మటన్ కోసే కత్తిని పెట్టుకుని వస్తుండగా పోలీసులు అతణ్ని పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుడు పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడని సీఐ పేర్కొన్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు

చైన్ స్నాచింగ్ నియంత్రణకు సహకరించాలి

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చైన్ స్నాచింగ్ నియంత్రణకు ప్రతీ ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి కోరారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలో చైన్‌స్నాచింగ్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మార్కెట్‌కు, ఒంటరిగా భయటకు వెళ్లే సమయంలో ఎక్కువగా బంగారు ఆభరణాలను ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు మెడలోని బంగారు ఆభరణాలు కనిపించకుండా కొంగు కప్పుకోవాలని పేర్కొన్నారు. కొంత మంది దుండగులు అడ్రస్ అడిగినట్లు నటిస్తూ బంగారు ఆభరణాలను తెంచుకొని పారిపోతున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ ఏసీపీ పి.నరసింహారావు, ఎస్‌ఐ శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ శిల్పవల్లి